RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్
దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 79 | ఫిబ్రవరి 12, 2025 | వెల : రూ.3-00

www.vedhanews.in

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ..
నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379

# 'ఆఖరి' మజిలీకి అంతులేని కష్టాలు

- జంతువుల మృతకళేబరాల నడుమ.. చెత్త వాతావరణంలో అంత్యక్రియలు
- దింపుడు కళ్లెం జాడే లేదు.. గౌరవ అంతిమ సంస్కారాలకు దిక్కులేని వైనం
- చావు కూడా ప్రశాంతంగా జరుపుకునే పరిస్థితులు లేక జనం ఇక్కట్లు
- అసలు పట్టించుకునే నాథుడే? లేరా అని ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ హిందూశ్మశాన వాటికలో సౌలతుల లేమి

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

మనిషి బతికున్నప్పుడే కాదు.. మరణించిన తర్వాత కూడా గౌరవంగా అంతిమ సంస్కారాలు నిర్వహించాలనే ఆలోచనతో గత ప్రభుత్వం శ్మశాన వాటికలు ఏర్పాటు చేసింది. కాగా, నిర్వహణ లోపం, పట్టింపు లేకపోవడంతో శ్మశానవాటికల్లో కనీస సౌలతుల్లేక జనం అవస్థలు పడుతున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ఏనుమాముల వద్ద ఏర్పాటు చేసిన హిందూ శ్మశాన వాటిక సమస్యల వలయంలో చిక్కుకోంది. శ్మశాన వాటికలో కనీసంగా దింపుడు కళ్లెం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు శ్మశాన వాటిక చుట్టూ విచ్చలవిడిగా చెత్తను పడవేసి ఉంచడంతో పరిసరాలు దుర్గంధ మయంగా మారిపోయాయి. విధిలేక అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పట్టించుకునే వారే లేరా? అని ఆగ్రహం

మనిషి చావు కూడా ప్రశాంతంగా జరుపుకునే పరిస్థితులు లేకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త, జంతు కళేబరాల మధ్యలో చివరి మజిలీ కార్యక్రమం దీనంగా, ఘోరాతిఘోరంగా చేసుకోవాల్సిన దుస్థితిలోకి పరిస్థితులను నెట్టివేసిన బాధ్యులపై కఠిన చర్యలు

మిగతా 4వ పేజీలో..



# కదలి రండి..

- '2కే రన్'లో పార్టిసిపేట్ చేయండి
- డ్రగ్స్ రహిత సమాజం కోసం..
- టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో ప్రోగ్రామ్
- విజయవంతం చేయాలని యూనియన్ పిలుపు



**వేద న్యూస్, వరంగల్:**

డ్రగ్స్..యువతను మత్తులో ముంచి చిత్తు చేస్తున్న ప్రస్తుత తరుణంలో సామాజిక బాధ్యతలో భాగంగా తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్(టీఎస్‌జేయూ) వరంగల్ జిల్లా కమిటీ చక్కటి అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. యూనియన్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ రహిత తెలంగాణ' కోసం 2కే రన్‌ను నిర్వహిస్తున్నది. నేడు (బుధవారం) ఫిబ్రవరి 12 ఉదయం 7:00 గంటలకు పోచమ్మ మైదాన్ సెంటర్ నుంచి కేఎంసీ వరకు చేపట్టే ఈ రన్‌లో గ్రేటర్ వరంగల్ నగరవాసులు, యువతీ యువకులు, ప్రజలు, మేధావులు, బుద్ధిజీవులు అందరూ పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూనియన్ వారు పిలుపునిచ్చారు.

### డ్రగ్స్ వాడబోము అని ప్రతిజ్ఞ చేద్దాం..

డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి పారద్రోలడంలో ప్రతి

మిగతా 4వ పేజీలో..

# అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ పోటీ చేయట్లేదు

4లో..



# వర్గీకరణలో న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశాం..

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**వేద న్యూస్, డెస్క్:**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ సిఫారసులను శాసన సభ ఆమోదించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ కలిశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మాదిగ ఉపకులాల ప్రతినిధులతో కలిసి సీఎంతో సుమారు రెండు గంటలపాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు రాగానే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై అసెంబ్లీలో చర్చించామని గుర్తు చేశారు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా మేలు చేస్తామని, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేసే లక్ష్యంతో ఉన్నామని పేర్కొన్నారు. కేబినెట్ సబ్‌కమిటీ, న్యాయకమిషన్ వేసి అధ్యయనం చేయించామని, వేగంగా నివేదిక తీసుకుని, కేబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెట్టామని తెలిపారు. ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చేశామని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసినందుకు రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలకు మందకృష్ణ మాదిగ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని సూచనలు ఇచ్చినట్లు ఆయన

మిగతా 4వ పేజీలో..



# అధికారుల నిర్లక్ష్యం.. కార్మికులకు శాపం..?

మంచిర్యాల : శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 బొగ్గు గని విషయంలో అధికారుల నిర్లక్ష్యం కార్మికులకు శాపంగా మారింది. గనిలోని పని స్థలాలు అనుమతులు ఇచ్చిన ప్రాంతాన్ని దాటి ముందుకు వెళ్లడం, కాలపరిమితి ముగియడంతో తక్షణమే బొగ్గు ఉత్పత్తి నిలిపివేయాలని ఇటీవల అటవీశాఖ నోటీసులు జారీ చేసింది. కాలపరిమితి ముగిసి దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా అటవీ అనుమతులు తిరిగి పొందడంలో నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందనే అభిప్రాయాలు వ్యక్తమతున్నాయి. అటవీశాఖ పరిధిలో బొగ్గు తవ్వకాలు జరిపేందుకు ప్రతీ నాలుగేళ్లకు ఒకసారి అటవీ అనుమతులు తీసుకోవలసి ఉంటుంది. ఈ విషయంలో యాజమాన్యం నుంచి సరైన స్పందన లేకపోవడంతో కాలపరిమితి ముగిసి బొగ్గు తవ్వకాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. అసలు అటవీ అనుమతులు లేకుండా గనిని ఎలా నడిపిస్తున్నారో సంబంధిత అధికారులకే తెలియాలి. ఆర్కే- 7 గని 1983 నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించింది. బొగ్గు తవ్వకాలకు సంబంధించి అటవీ అనుమతులు నాలుగేళ్ల క్రితమే 31-12-2020తో ముగిశాయి. అంతకు ముందే 2018లో ఏరియా అధికారులు లీజు రెన్యూవల్ కోసం కేంద్ర అటవీశాఖకు దరఖాస్తు చేశారు. ఇప్పటి వరకు అధికారుల నుంచి అనుమతి రాలేదు. ఈ విషయమై కేవలం ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రమే కొనసాగించగా, సింగరేణి యాజమాన్యం, తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదనే ప్రచారం కార్మిక వర్గాల్లో జరుగుతోంది. గనిలోని ఒక దిశలో 20 శాతం లీజు, మరో దిశలో 80 శాతం లీజు పరిధిలో ఉన్నాయి. డీ పిల్లరింగ్ విధానంలో రెండు సీమ్‌లు నడుస్తున్నాయి. అనుమతులు లేని కారణంగా ప్రస్తుతం ఒక సీమ్ బంద్ చేయాలనే ఆదేశాలున్నాయి. అటవీశాఖ భూములు ఉన్న ప్రాంతంలోని గనికున్న హద్దులు దాటి లోపల బొగ్గును తవ్వుతున్నందన అటవీశాఖ అభ్యంతరం చెబుతోంది. నెల క్రితమే ఏరియా అధికారులకు గని విషయంలో తాఖీదులు రాగా, సింగరేణి కార్పొరేట్ స్థాయిలో అటవీ, ప్లానింగ్, ఎస్టేట్స్ శాఖలు సమన్వయంతో పని చేసి కేంద్ర అటవీశాఖ




నుంచి అనుమతి పొందాల్సి ఉంది. అటవీ అనుమతులు లేని కారణంగా బొగ్గు తవ్వకాలు నిలిపి వేయనుం డటంతో గనిలో పని చేసే కార్మికులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. ఆర్కే-7 గనిలో 1380 మంది కార్మికులు పనిచేస్తున్నారు. గనిలో ఉత్పత్తి నిలిపివేయాల్సి రావడంతో త్వరలో కార్మికులను యాజమాన్యం బదిలీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. సుమారు 400 మందికి పైగా ఉద్యోగులను స్థానికంగా ఉన్న ఇతర గనులకు తాత్కాలికంగా డిప్యుటేషన్‌పై పంపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఉన్న ఫలంగా ఇతర గనులకు వెళ్లడంపై ఉద్యోగులు ఒకింత అసహనానికి గురవుతున్నారు. యాజమాన్యం, అధికారుల తప్పిదానికి తాము మూల్యం చెల్లించుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని మదనపడుతున్నారు. నిబంధనల మేరకు యాజమాన్యం వ్యవహరించి, అనుమతులు పొంది ఉంటే ఇబ్బందులు ఏర్పడేవి కాదనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ప్రత్యేక చొరవ తీసుకొని అటవీ అనుమతులు త్వరిత గతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

# విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేశాం



రామగిరి : రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేశామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని రత్నాపూర్‌లో 4.16లక్షలతో విద్యుత్ ఉపకేంద్రం, పన్నూరు గ్రామపంచాయతీ పరిధీలో రూ.3.5 లక్షలతో నిర్మాణం చేపట్టిన కస్తూర్బా నూతన భవనాలను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. అనంతరం మంవత్రి మట్లాడారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం సింగరేణి సహకారంతో నాలుగు కోట్ల 16లక్షలతో నిర్మాణం చేసుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. రాష్ట్రంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కంటే అధిక స్థాయిలో అవసరం ఏర్పడుతున్న క్రమంలో రైతులకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాలతో పాటు గ్రిడ్ నుంచి సైతం విద్యుత్ కొనుగోలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. చిన్నపాటి సాంకేతిక సమస్యల వల్ల కలిగే విద్యుత్ అంతరాయాలను సైతం ప్రతిపక్ష నాయకులు రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. రత్నాపూర్ గ్రామంలో నెలకొనే ఆర్అండ్ఆర్ కాలనీ ప్రజలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కావద్దనే ఉద్దేశంతో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మరో తొమ్మిది సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రత్నాపూర్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామన్నారు. గ్రామానికి చెందిన మహిళలు మరిన్ని ప్రతిపాదనలు చేశారని వాటిపై సైతం దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపుకలెక్టర్ అరుణ, ఆర్డీవో హనుమానాయక్, పెద్దపల్లి విద్యుత్‌శాఖ ఎస్ఈ సుదర్శన్, డీఈవో మాధవి, మంథని డీఈ ఈశ్వర్‌ప్రసాద్, ఏఈ మోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని సెంటినరీకాలనీ మేకల మార్కెట్‌లోని శ్రీరామాంజనేయ స్వామి, ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఎస్అండ్‌పీసీ కార్యాలయంలోని త్రయంబకేశ్వర ఆలయాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక పూజాల్లో పాల్గొన్నారు. 101 కొబ్బరికాయాలను కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయంలోని సిబ్బంది మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించారు.

# అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


కల్వకుర్తి, : అంగన్‌వాడీల సమస్య లను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు మాస మ్మ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న ఛలో ఐసీడీఎస్ కమిషనరేట్ కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో వెంకటమ్మకు అంగన్ వాడీ టీచర్లతో కలిసి వారు వినతిపత్రం అందజే శారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, టీచర్లను, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇ చ్చిన హామీలను అమలుపర్చాలని డిమాండ్ చే స్తూ ఈనెల 19న ఛలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్య క్షుడు డి. ఈశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం ఆ యన విలేకర్లతో మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల నివాసగృహాల ముం దు నిరసన



తెలియజేస్తే నోటీసులు ఇవ్వడం దు ర్మార్గమైన చర్య అని.. సీఐటీయూ ఈ చర్యనుతీవ్రంగా ఖండిస్తోందన్నారు. అనంతరం అంగన్ వాడీ సమస్యలను లిఖితపూర్వకంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వాతికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, అంగన్‌వాడీ కొల్లాపూర్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యద ర్శులు సాయిలీల, నీరజ, అంగన్‌వాడీలు నిర్మల, హుస్సేనమ్మ, శ్యామల, శోభ తదితరులున్నారు.

# కొట్టుకపోయిన తాత్కాలిక వంతెన

వేమనపల్లి,: మండలంలోరాత్రి కురిసిన వర్షానికి నీల్వాయి నుంచి మామడ గ్రామానికి వెళ్ళే రోడ్డు మార్గంలో ఉన్న ఒర్రెపై నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకపోయింది. దీంతో మామడ గ్రామ స్థులు నీల్వాయి, వేమనపల్లి గ్రామాలకు కాలినడకన రావాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షానికి తాత్కాలిక వంతెనపై పోసిన మట్టి, ఇసుక బస్తాలు పూర్తిగా కొట్టుకపోవడంతో కనీసం ద్విచక్ర వాహనాలు సైతం వెళ్ళలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి నీల్వాయి గ్రామంలో అల్లూరి ధర్మయ్య, చెన్నూరి బాలయ్య, గురుండ్ల నామ్‌దేవ్‌లకు చెందిన పెంకుటిల్లు కూలిపోయాయి. వర్షం పడు తున్నప్పుడు ఆ ఇళ్లల్లో వారు లేక పోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లాలో గడిచిన 24 గంటల్లో 23.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వేమనపల్లి మండలంలో 138.6 మిల్లీమీటర్ల వర్షం



కురిసింది. చెన్నూరు మండలంలో 70.5 మిల్లీమీటర్లు, కోటపల్లి 69.3, భీమారం 24.1, నెన్నెల మండలంలో 16.4, కన్నెపల్లి 16.2, భీమిని 12.2,జైపూర్ మండలంలో 8.5,బెల్లంపల్లి మండలంలో 8.1, తాండూరు 7.8, లక్షెట్టిపేట 7.5, హాజీపూర్ మండలంలో 6.8, కాసిపేట, దండేపల్లి మండలాల్లో 6.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

# అసంపూర్తి పనులు.. మౌలిక వసతుల కరవు!

పెద్దపల్లి :సుల్తానాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి కింద రూ.20 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు నిర్మాణం గోడలకే పరిమితమైంది. పెద్దపల్లి పట్టణం మచిలిఖేడ ప్రాథమిక ఉర్దూ పాఠశాల ముందు మురుగు నీటి దుర్వాసన విద్యార్థులను అనారోగ్యానికి గురి చేస్తోంది. ఇక్కడ 24 మంది విద్యార్థులుండగా అమ్మ ఆదర్శ కమిటీలో వంటశాల, మూత్రశాలల నిర్మాణం గోడలకే పరిమితమైంది. పట్టణంలోని మురుగు నీరు ఈ కాలువ నుంచే ప్రవహిస్తోంది. ఓదెల మండలం హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. శ్మశాన వాటిక సమీపంలో బడి ఉండటం శవాలను కాల్చివేసే సమయంలో గదుల్లోకి పొగ వస్తుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. రెండేళ్లుగా 'మన ఊరు-మన బడి' పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పర్యవేక్షణలో పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. జిల్లాలో 539 పాఠశాలల్లో 26,215 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి, ఆట స్థలాలు అందుబాటులో లేవు. బడుల్లో ప్రహరీ లేకపోవడంతో పందులు, పశువులు సంచరిస్తున్నాయి. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

# అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

కరీంనగర్ : నగరంలోని అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని కట్టడాలపై నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగం ప్రత్యేక దృష్టి సారించింది. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాల మేరకు వారంరోజుల్లో ఆరు అక్రమ కట్టడాలు, అనుమతి లేని నిర్మాణాలను కూల్చివేశారు. గౌతమ్‌రావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు, కోర్టు ఆదేశాలతో మంకమ్మతోటలో నగరపాలక సంస్థ ఇచ్చిన అనుమతికి మించి నిర్మించిన సెకండ్ ఫ్లోర్, ఆపై నిర్మించిన పెంట్‌హౌస్‌న్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డిప్యూటీ సిటీ ప్లానర్ భానుచందర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఇళ్లను, భవనాలను, వాణిజ్య సముదాయాలను నిర్మించుకునేందుకు బల్దియా నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతిలేకుండా, అనుమతికి మించి, అక్రమ కట్టడాలను చేస్తే మున్సిపల్ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశాలతో వారం రోజుల్లో ఆరు కట్టడాలను కూల్చివేశామని, అక్రమ కట్టడాలు, అనుమతిలేని భవనాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. మంకమ్మతోటలో ఒకరు జీ+1 భవన నిర్మాణానికి అనుమతి తీసుకొని, రెండంతస్తుల తోపాటు పెంట్‌హౌస్‌ను నిర్మించుకున్నారన్నారు. దీనిపై స్థానికుడు గౌతమ్‌రావు నగరపాలక సంస్థలో ఫిర్యాదు చేయడంతోపాటు కోర్టును



ఆశ్రయించారని చెప్పారు. కోర్టు సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించి ఇచ్చిన ఆదేశాల మేరకు సంబంధిత ఇంటి యజమానికి నోటీసులను జారీ చేశామని తెలిపారు.మున్సిపల్ కమిషనర్ సూచనలతో టీపీవో శ్రీహరి,టీపీఎస్ రాజ్‌కుమార్,నవీన్‌తో కలిసి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసినట్లు చెప్పారు. భవ నాలు, ఇళ్ల నిర్మాణాలకు నగరపాలక సంస్థ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, నిబంధనలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నగర అభివృద్ధికి సహకరించాలని డీసీపీ కోరారు. లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని, ఇలాంటి మరిన్ని కట్టడాలు మరిన్ని ఉన్నాయని తమ దృష్టికి వచ్చిందని, నోటీసులు జారీ చేసి వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# దేవాదాయ శాఖలో బదిలీలు

వేములవాడ: దేవాదాయ, ధర్మాదాయ శాఖలో బదిలీలు చేస్తూ రాష్ట్ర దేవాదాయ కమిషనర్ కార్యాలయం నుంచి బుధవారం రాత్రి ఉత్వర్వులు ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అసిస్టెంట్ కమిషనరేట్ పరిధిలో అసిస్టెంట్ కమిషనర్‌తోపాటు జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయానికి డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారిని నియమించారు. అలాగే జిల్లాలోని పలు ఆలయాల ఈవోలను సైతం బదిలీ చేశారు. కరీంనగర్ అస్టిసెంట్ కమిషనర్, కొండగట్టు ఇన్‌చార్జి ఈవోగా ఉన్న ఆకునూరి చంద్రశేఖర్‌ను మెదక్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అలాగే హైదరాబాద్ ఎండోమెంట్ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎం రామకృష్ణారావును కొండగట్టు ఆలయ ఈవోగా నియమించారు. గ్రేడ్-1 ఈవోగా ఉండి ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న కే సుధాకర్‌ను కరీంనగర్‌లోని మారెట్ రోడ్డు వేంకటేశ్వర స్వామి ఆలయానికి బదిలీ చేశారు. కరీంనగర్‌లోని హనుమాన్ సంతోషి మాత ఆలయఈవోగా ఉన్న నాగుల అనిల్ కుమార్‌ను తిమ్మాపూర్ మండలం నల్లగొండ సీతారామలక్ష్మి నరసింహస్వామి ఆలయానికి బదిలీ చేశారు. కరీంనగర్‌లోని విజయగణపతి సాయిబాబా దేవాలయం ఈవో ఏ మారుతిని మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ఈవోగా నియమించారు. కరీంనగర్ మంకమ్మతోట వేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రేడ్- 3 ఈవోగా ఉన్న నాగారపు శ్రీనివాస్‌ను గ్రేడ్-2 ఈవోగా పదోన్నతి కల్పిస్తూ కరీంనగర్ జ్యోతినగర్ లోని హనుమాన్ సంతోషి మాత ఆలయానికి కేటాయించారు. అలాగే



గ్రేడ్-3 ఈవోగా ఉన్న వామన్ రావుకు పదోన్నతి కల్పిస్తూ జగిత్యాలోని దుబ్బ రాజరాజేశ్వర్ స్వామి ఆలయ ఈవోగా బదిలీ చేశారు. పెద్దపల్లిలోని లక్ష్మీనరసింహా స్వామి ఆలయం లో ఈవోగా ఉన్న ఎం శంకరయ్యను మంథనిలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ ఈవోగా బదిలీ చేశారు. అలాగే వేములవాడ ఇన్‌చార్జి ఈవోగా ఉన్న డీసీ వినోద్ రెడ్డికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. 2020జూలైలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా దేవా దాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆకునూరి చంద్రశేఖర్ ఉమ్మడి జిల్లాలో తనదైన ముద్ర వేసుకున్నారు.

# జొన్న పంటలో పుష్కలంగా ఇథనాల్..

వరంగల్: చాలామంది తెల్ల, పచ్చ జొన్నలు తమ ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఆహారంలో భాగం చేసుకుంటారు. ప్రస్తుతం దేశంలో మరో రకం జొన్న పంట సాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధలు చేస్తున్నారు. అయితే తియ్యగా ఉండే ఈ రకం జొన్న తినడానికి ఉపయోగించరు. ఇందులో ఇథనాల్ ఎక్కువగా లభిస్తుంది. దీన్ని పెట్రోల్‌లో కలిపేందుకు వినియోగిస్తున్నారు. పెట్రోల్ దిగుమతిని తగ్గించి, పర్యావరణాన్ని రక్షించేందుకు పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాలని కేంద్ర లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 12 శాతం ఇథనాల్ మాత్రమే పెట్రోల్‌లో కలుపుతున్నారు. ఇప్పటిదాకా.. చెరకు నుంచి తీసిన ఇథనాల్‌ను మాత్రమే వాడుతున్నారు. చెరకు విస్తీర్ణం రోజురోజుకూ తగ్గిపోతోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. అందుకే ఇథనాల్ ఉత్పత్తి కోసం శాస్త్రవేత్తలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృషి సారించారు. తియ్యటి జొన్న పంటలో ఇథనాల్ పుష్కలంగా లభిస్తుందని గుర్తించి.. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) తోడ్పాటుతో దీనిని ఉత్పత్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఐకార్‌కు అనుబంధంగా పనిచేసే హైదరాబాద్‌లో ఉన్న భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ.. దేశంలో తియ్యటి జొన్న విత్తనోత్పత్తి కోసం సాగు చేస్తోంది.ఇందులో భాగంగానే వరంగల్ రీజియనల్ అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ లో కూడా రెండెకరాల్లో



'జైకార్ రసీలా' అనే రకం జొన్నను సాగు చేశారు. ఇప్పుడు అది కోతకు వచ్చింది. దేశవ్యాప్తంగా ఈ పంట సాగుకు ఐఐఎంఆర్ శాస్త్రవేత్త డా.ఏవీ ఉమకాంత్ నేతృత్వం వహిస్తున్నారు. ఆయన తన బృందంతో కలిసి బుధవారం వరంగల్‌లో సాగైన ఈ జొన్న పంటను పరిశీలించారు.మరో విషయం ఏంటంటే.. ఈ తియ్యటి జొన్న నుంచి ఇథనాల్‌ను బయటికి తీసేందుకు ప్రత్యేకంగా ఎలాంటి యంత్రాలు అవసరం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం చెరకు పరిశ్రమల్లో వినియోగిస్తున్న యంత్రాలను వీటికి ఉపయోగించవచ్చని అన్నారు.

# ఆగని బియ్యం దందా..?

కుమ్రంభీం ఆసిఫాబాద్,:జిల్లాలో దాడులు జరుగుతున్నా రేషన్ బియ్యం అక్రమ దందా ఆగడం లేదు.పతి నెలా ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నది. బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెంచి పట్టుకున్న అధికారులు ఇటీవల అక్రమ రవాణాపై దృష్టి సారించకపోవడంతో అక్రమ వ్యాపారులు చెలరేగిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాగా మారింది. కాగజ్‌నగర్ అడ్డాగా ఇటు మంచిర్యాల, బెల్లంపల్లి నుంచి, మరో వైపు ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్-టీ మీదుగా చౌక బియ్యం పొరుగుకు రాష్ట్రానికి రవాణా అవుతున్నది. ఈ దందా ప్రతి నెలా రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం ఇవ్వడం నుంచి మొదలవుతున్నది. కొంతమంది వ్యాపారులు ప్రత్యేకంగా రేషన్ బియ్యం కొని పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు చేస్తున్నా అక్రమార్కుల్లో మార్పు రావడం లేదు. స్థానిక అధికారుల అండదండలు, రాజకీయ నాయకుల సహాయ సహకారాలతోనే బియ్యం దందా యథేచ్చగా కొనసాగుతున్నదనే అనుమానాలు కలుగుతున్నాయి. బియ్యం రవాణా చేస్తూ పట్టుబడుతున్న వారిపై కేసులు నమోదవుతున్నప్పటికీ అక్రమ బియ్యం దందా మాత్రం ఆగడం లేదు. అక్రమార్కులు వివిధ మార్గాల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతి నెలా ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నది. బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెంచి పట్టుకున్న అధికారులు ఇటీవల అక్రమ రవాణాపై దృష్టి సారించకపోవడంతో అక్రమ వ్యాపారులు చెలరేగిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాగా మారింది. కాగజ్‌నగర్ అడ్డాగా ఇటు మంచిర్యాల, బెల్లంపల్లి నుంచి, మరో వైపు ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్-టీ మీదుగా చౌక బియ్యం పొరుగుకు రాష్ట్రానికి రవాణా అవుతున్నది. ఈ దందా ప్రతి నెలా రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం ఇవ్వడం నుంచి మొదలవుతున్నది. కొంతమంది వ్యాపారులు ప్రత్యేకంగా రేషన్ బియ్యం కొని వాటిని విక్రయించడమే వృత్తిగా



పెట్టున్నారు. కొన్ని ప్రాం తాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ షాపు వద్దనే కొనడం, మరి కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇవ్వకుండానే నేరుగా రేష న్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కిలో బియ్యాన్ని రూ.12కు కొనుగోలు చేసి మ హారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాల్లో రూ.20కు వరకు విక్రయిస్తున్నారు. మహారాష్ట్రకు తరలి వెళ్తున్న బియ్యాన్ని పట్టుకునేందుకు మధ్యలో ఎక్కడ చెక్‌పోస్టులు లేవు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్న వ్యాన్‌లలో జిల్లాలో వాంకిడి, సిర్పూర్-టీ మండలంలోని వెంట్రావ్‌పేట్, తదితర మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ గోదాముల్లో డంప్ చేసి, అక్కడి నుంచి భారీ వాహనాల్లో గొందియా, బల్లార్షలోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహిస్తూ కేసులు పెడుతున్నా ఎలాంటి భయం లేకుండా అక్రమార్కులు దందాను కొనసాగిస్తున్నారు. ఇటీవల టాస్క్‌ఫోర్స్ అధికారులు పెంచికల్‌పేట్‌లో ఓ వ్యాపారి ఇంట్లో సోదాలు చేసి రవాణాకు సిద్ధంగా 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు.కాగజ్‌నగర్ చింతగూడా కోయవాగు వద్ద అక్రమంగా మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 122 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు.

# ముగింపు దశకు బదిలీలు..?




ఖమ్మం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల బదిలీల ప్రక్రియ ముగింపు దశకుచేరింది. 30న బదిలీ ఉత్తర్వులు ఇస్తారు. 31న ఆ యాకళాశాలల నుంచి రిలీవ్ అయి కేటాయించిన కళాశాలల్లో అధ్యాపకులు రిపోర్టు చేయాల్సి ఉంది. దీర్ఘకాలికంగా ఒకేచోట పని చేసిన వారికి స్థానచలనం కలగనుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొత్తం పది ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. వీటిలో ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్, పాల్వంచ, భద్రాచలం కళాశాలలకు స్వయం ప్రతిపత్తి ఉంది. అన్నింట్లో కలిపి సుమారు 100 నుంచి 140 మందికి పైగా బదిలీలు జరిగే అవకాశముంది. ఈ ఏడాది జూన్ 30 నాటికి ఒక స్థానంలో ఐదేళ్లకు పైగా పనిచేస్తున్న వారు తప్పనిసరిగా బదిలీ అవుతారు. అధ్యాపకులు ఆప్షన్ ఇవ్వకపోయినా ఖాళీ ఉన్నచోటుకు విద్యాశాఖే బదిలీ చేస్తుంది. 2026 జూన్ 30 లేదా ఆ లోపు ఉద్యోగ విరమణ పొందనున్న వారికి మినహాయింపు ఉంటుంది. ఒకస్థానంలో రెండేళ్ల సర్వీసు పూర్తయినా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. బదిలీలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఉన్నవి నాన్ ఫోకల్ పోస్టులే కావడంతో ఖమ్మం జిల్లాకు చెందిన అధ్యాపకులు పరిసర ప్రాంతాలైన నేలకొండపల్లి, మధిర, సత్తుపల్లి, ఇల్లెందు, గార్ల, మరిపెడ బంగ్లా, కొత్తగూడెంలోని డిగ్రీ కళాశాలలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. భద్రాద్రి జిల్లాలోని అధ్యాపకులు ఎస్ఆర్‌బీజీఎన్ఆర్, మహిళా డిగ్రీ కళాశాల, భద్రాచలం వెళ్లేందుకు ఇష్టపడుతున్నారు. ఐదేళ్ల కాలపరిమితి పూర్తి చేసిన ప్రతి అధ్యాపకుడు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో 78 మంది అధ్యాపకులు ఉండగా 55 మందిని బదిలీ చేస్తారు. ప్రతి కళాశాలలో 10- 15 మందికి స్థానచలనం కలగనుంది

# రుణ లక్ష్యం భళా.. మంజూరులో డీలా!



కొత్తగూడెం: ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతులకు పెట్టుబడి.. భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పంట రుణాలందిస్తోంది. వార్షిక రుణ ప్రణాళికల్లో పంట రుణ లక్ష్యాలను భారీగా నిర్ణయిస్తున్నా.. వాటిని సాధించటంలో బ్యాంకర్లు తడబడుతున్నారు. పంట రుణాలను సర్కారు మాఫీ చేస్తుందని రైతులు తమ ఖాతాలను పునరుద్ధరించుకోవటం లేదని, అందుకే కొత్త రుణాలు ఇవ్వలేకపోతున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం పంట రుణాలు మాఫీ చేయటంతో నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకర్లు రుణాలిస్తారనే ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ వానాకాలంలో 5.74 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇప్పటికే పత్తి పంట అంచనాలకు మించి సాగైనట్లు చెబుతున్నారు. ఇతర పంటల సాగుకు అన్న దాతలు సన్నద్ధమవుతున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం పంట రుణాలను మాఫీ చేస్తుందనే ఆశతో రైతులు తమ ఖాతాలను పునరుద్ధరించుకోలేదు. పెట్టుబడి సాయానికి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. జిల్లాలో 28,018 రైతుల ఖాతాలకు సంబంధించి రూ.లక్షలోపు రుణాలను ప్రభుత్వం ఇటీవల మాఫీ చేసింది. ఈనెలాఖరులోపు రూ.లక్షన్నర లోపు, పంద్రాగస్టు నాటికి రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వానాకాలం, యాసంగి సాగుకు కలిపి రైతులకు రూ.2,477.27కోట్ల పంట రుణాలివ్వాలని లక్ష్యం నిర్ణయించగా.. రూ.1,354.31 కోట్లు (54.67శాతం) మాత్రమే ఇచ్చారు. 2023-24లో రూ.2,710.98 కోట్ల పంట రుణాలు మంజూరు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నా.. ఇచ్చింది రూ.1,400.24 (51.65శాతం) కోట్లు మాత్రమే. ప్రభుత్వం రూ.2లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేస్తుండటంతో రైతులకు 2024-25లో కచ్చితంగా కొత్త రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈసారి వర్షాకాలంలో రూ.1,271 కోట్లు, యాసంగిలో రూ.846.33 కోట్ల పంట రుణాలను రైతులకు అందించాలి. ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఇటీవల నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో రుణమాఫీ డబ్బులను.. మాఫీ కోసమే వినియోగించాలని ఆదేశించారు. రైతుల ఖాతాలను రెన్యువల్ చేసి కొత్త రుణాలివ్వాలని సూచించారు. ఈనేపథ్యంలో కలెక్టర్ అధ్యక్షతన సమావేశాలు నిర్వహించి నాబార్డు లక్ష్యాలకు అనుగుణంగా కొత్త రుణాలందించేలా చర్యలు తీసుకోవాలి.

# కుక్కల నియంత్రణ చర్యలు శూన్యం!



కరీంనగర్:కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలు పరుగులు పెట్టిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం పూట వీధులలో తిరుగుతూ రాకపోకలు సాగించే వృద్ధులు, పిల్లలు, మహిళల వెంట పడుతున్నాయి. రాత్రి అయితే అరుపులుతో గోల చేస్తున్నాయి. నగరంలోని బోయవాడ, సిక్కువాడీ, వావిలాలపల్లి, సప్తగిరికాలనీ, కట్టరాంపూర్, భగత్‌నగర్, శివాజీనగర్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో పలువురిపై దాడికి దిగాయి. ఓ డివిజన్ కార్పొరేటర్ నడుచుకుంటూ వెళ్తుండగా వెనక్కి నుంచి వచ్చి కరుస్తుండటంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. పురపాలక శాఖ ఆదేశాల మేరకు వీధికుక్కల నియంత్రణకు కమిటీ వేయాలని, శస్త్ర చికిత్సలు ప్రారంభించాలని ఆదేశించినా ఆ దిశగా ఎక్కడా చర్యలు కనిపించడం లేదు. యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ), జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం వీధి కుక్కల సంఖ్య తగ్గించేందుకు శస్త్ర చికిత్సలు చేస్తారు. గతేడాది మార్చిలో టెండర్లు పిలవగా ఆ సమయంలో 821 శునకాలకు సంతానోత్పత్తి కలగకుండా ఆపరేషన్లు చేశారు. దీనిపై ఫిర్యాదు అందడంతో అప్పటి నుంచి ఇప్పటివరకు పూర్తిగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలోనే ఫిర్యాదులు అధికంగా వస్తుండటం, ప్రభుత్వం ఆదేశించడంతో ఇటీవల కమిషనర్ పశు వైద్యశాలలో ఉన్న ఏబీసీని పరిశీలించారు. అక్కడ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మరో వైపు టెండర్ ప్రక్రియ కూడా చేయాల్సి ఉంది. అప్పటిలోగా వీటిని ఎలా నియంత్రిస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. కుక్కల నియంత్రణకు మూడు, నాలుగు రోజులలో శస్త్రచికిత్సలు ప్రారంభిస్తాం. సంబంధిత ఏజెన్సీతో మాట్లాడాం. ఈలోపు సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకునేందుకు ఆదేశించాం. కుక్కల సంతానం విపరీతంగా పెరిగింది. ఒక్కో వీధిలో పాతిక సంఖ్యలో తిరుగుతున్నాయి. 60 డివిజన్లలో సుమారు 4 వేల కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. వీటి సంఖ్య మరింత ఉండనుంది.

వీధుల్లో ఆహారం దొరకకపోవడం, చికెన్ సెంటర్లు, మాంసం దుకాణాల దగ్గర అడ్డాలు పెడుతుండటం, వ్యర్థాలు పడేస్తుండటంతో కొట్లాటకు దిగుతున్నాయి. వీధి కుక్కల బెడద తీవ్రంగా మారి మనుషులపై దాడులకు దిగుతు న్నాయి.. వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రభు త్వాన్ని ఇటీవల హైకోర్టు ఆదేశించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా తక్షణ చర్యలు తీసుకునే విధంగా నియంత్రణకు పర్య వేక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కరీంనగర్ జిల్లాలో శునకాల బెడద తగ్గించేందుకు కనీస సౌకర్యాలు కూడా కనిపించడం లేదు. జిల్లా కేంద్రంలో అయితే శస్త్ర చికిత్సలు చేసేందుకు ఆటంకాలు మాత్రం తప్పడం లేదు.

# విద్యుత్తు నియంత్రికలపై పిడుగుపాటు!



గంగాధర : ఎన్నడూ లేనివిధంగా వర్షాకాలంలో ఈసారి విద్యుత్తు నియంత్రికలు కాలిపోతున్నాయి. మే 25 నుంచి జులై 28 వరకు 82 విద్యుత్తు నియంత్రికలు కాలిపోయాయి. వీటిలో 16 కేవీ నియంత్రికలు 50 కాలిపోగా 25 కేవీ నియంత్రికలు 23, 63 కేవీ నియంత్రికలు 9 కాలిపోయినట్లు అధికారులు ధ్రువీకరించారు. వర్షాకాలంలో కొద్దిపాటి మెరుపులు, పిడుగులకే నియంత్రికలు కాలిపోతున్నాయని రైతులు తెలిపారు. వాటి స్థానంలో మరమ్మతులు చేసిన నియంత్రికలు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నా డిమాండ్‌కు సరిపడా సకాలంలో సరఫరా చేయలేక చేతులెత్తుస్తున్నారు. గంగాధర విద్యుత్తు ఉపకేంద్రం ఆవరణలో ఉన్న మరమ్మతుల కేంద్రంలో గుత్తేదారు నిర్లక్ష్యంతో నియంత్రికలకు సరిగా మరమ్మతులు చేయడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వారం కిందట మంగపేట గ్రామంలో ఒకేరోజు రెండు విద్యుత్తు నియంత్రికలు కాలిపోయి రక్షిత మంచినీటి బావులతోపాటు కుటుంబాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఈ నియంత్రికలను తొలగించి వాటి స్థానంలో మరమ్మతు చేసిన నియంత్రికలు బిగించాల్సి ఉండగా గంగాధర మండల కేంద్రంలోని మరమ్మతుల కేంద్రంలో నియంత్రికలు అందుబాటులో లేవు. జిల్లా కేంద్రంలో కూడా నియంత్రికలు లేకపోవడంతో చొప్పదండి మండలం వెదురుగట్టలో ఉన్న నియంత్రికను సొంతంగా ట్రాక్టర్ సమకూర్చుకొని నియంత్రిక తెచ్చుకున్నారు.వాటి స్థానంలో మరమ్మతులు చేసిన నియంత్రికలు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నా డిమాండ్‌కు సరిపడా సకాలంలో సరఫరా చేయలేక చేతులెత్తుస్తున్నారు. గంగాధర విద్యుత్తు ఉపకేంద్రం ఆవరణలో ఉన్న మరమ్మతుల కేంద్రంలో గుత్తేదారు నిర్లక్ష్యంతో నియంత్రికలకు సరిగా మరమ్మతులు చేయడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకుగాను రూ.5 వేలు ఖర్చు చేయాల్సివచ్చిందని మంగపేట వాసులు తెలిపారు. ఇదే పరిస్థితి జిల్లాలో అనేక గ్రామాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్తు సరఫరాలో లోపాలు నివారించి నియంత్రికలు కాలిపోకుండా చర్యలు తీసుకోవాలని.. కాలిపోయిన నియంత్రికలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

# పర్యవేక్షణ లోపం.. స్వచ్ఛతకు విఘాతం!



వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు అధికార యంత్రాంగం చేస్తున్న ప్రయత్నానికి పట్టణ శివారు రోడ్ల వెంబడి కొందరు ఇష్టారాజ్యంగా వ్యర్థాలు పారబోస్తూ విఘాతం కలిగిస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ నామమాత్రం కావడం ఇందుకు దోహదపడుతోంది. పట్టణంలోని రెండు బైపాస్ రహదారుల వెంబడి, మూలవాగు, పట్టణ శివారు కాలువలు, మూలవాగు, పట్టణంలోని ఖాళీ స్థలాలు వ్యర్థాలకు నిలయంగా మారాయి. వర్షాకాలం కావడంతో వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. పట్టణంలోని చాలా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది. వేములవాడ పట్టణంతో పాటు మరో అయిదు విలీన గ్రామాలను కలుపుకొని 28 వార్డులున్నాయి. ఇందులో పారిశుద్ధ్యం పనులు చేసేందుకు 93 మంది రెగ్యులర్ కార్మికులు ఉన్నారు. వీరితో పాటు తాత్కాలిక సిబ్బంది పని చేస్తున్నారు. అయినా వార్డుల్లో పూర్తి స్థాయిలో పారిశుద్ధ్యం పనులు జరగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వానాకాలంలో ప్రతి వార్డులో పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు దాదాపు రూ.20 లక్షలు కేటాయించి మున్సిపల్ కార్మికులతోపాటు అదనంగా రోజు పది నుంచి పదిహేను మంది కార్మికులను టెండర్ ద్వారా ఏర్పాటు చేసి పనులు చేపట్టారు. మురుగు కాలువల వెంబడి గడ్డి తొలగించడం, కాలువల్లో మురుగు తొలగించడం వంటి పనులు చేపట్టారు. ఈ పనులు కొన్ని కాలనీలకే పరిమితమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి రోజు చెత్త వాహనాల ద్వారా 20 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి డంపు యార్డుకు తరలిస్తున్నారు. అయినా కొన్ని వార్డుల్లో చెత్త ఆటోలు రావడం లేదనే ఆరోపణలున్నాయి. వేములవాడ పట్టణంలోని అనేక ప్రాంతాల్లోని రోడ్ల వెంబడి చెత్తా చెదారంతోపాటు కోళ్ల వ్యర్థాలు, ఇతరత్రా వ్యర్థాలను యథేచ్ఛగా పారేయడం పరిపాటిగా మారింది. నియంత్రించాల్సిన మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇది నిరాటంకంగా సాగుతోంది. రహదారులపై వ్యర్థాలను పారబోసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో పట్టణ శివారు రోడ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయని, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలో రూ.20 లక్షలు వెచ్చించి ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. ఇప్పటికే ఎనిమిది వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు పూర్తయ్యాయి. పట్టణ శివారు ప్రాంతాల్లో చెత్త పారబోసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

# జాతీయ రహదారులపై ఆశలు



జగిత్యాల: ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారులపై ఆశలు నెలకొంటున్నాయి. నిజామాబాద్-జగదల్‌పూర్ జాతీయ రహదారి జగిత్యాల జిల్లాలో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి మీదుగా మంచిర్యాల వైపు వెళ్తుండగా 4 వరసల రహదారి విస్తరణ కోసం సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించారు. ప్రస్తుతం భూసేకరణ చేపడుతున్నారు. జగిత్యాల-కరీంనగర్ మధ్య ఆరేళ్ల కిందట నిధులు మంజూరైనప్పటికీ భూసేకరణలో జాప్యంతో పనులు రద్దు కాగా ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ పూర్తి కావస్తోంది. కరీంనగర్-వరంగల్ మధ్య 4వరసల రహదారి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 4 కొత్త జాతీయ రహదారులు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం వరకు 130 కి.మీ రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని ప్రతిపాదించారు. ఈ రహదారి నిర్మాణంతో జాతీయ రహదారి 565,563,353 అనుసంధానించడమే కాకుండా తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రజలకు అనువుగా ఉంటుందని కాళేశ్వరం క్షేత్రానికి ప్రాధాన్యం లభిస్తుందని భావిస్తున్నారు. కరీంనగర్-వేములవాడ-సిరిసిల్ల జిల్లా కామారెడ్డి జిల్లా పిట్లం వరకు 165 కి.మీ, సిరిసిల్ల-వేములవాడ మీదుగా కోరుట్ల వరకు 65 కి.మీ, కరీంనగర్ నుంచి రాయపట్నం వరకు 60 కి.మీ, రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా

విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా మంత్రి డి.శ్రీధర్‌బాబు తదితరులు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. జగిత్యాల-కరీంనగర్ మీదుగా వరంగల్ వరకు జాతీయ రహదారిగా మార్చేందుకు ఆరేళ్ల కిందట నిధులు మంజూరయ్యాయి. రూ.2500 కోట్లతో టెండర్లు జరిగినప్పటికీ భూసేకరణ విషయమై అభ్యంతరాలు రావటంతో అర్థంతరంగా నిలిచిపోయింది. ప్రస్తుతం కరీంనగర్-వరంగల్ మధ్య రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండగా జగిత్యాల-కరీంనగర్ మధ్య పనులకు మోక్షం కలగకపోవ దంతో నిధులు వాపస్ పోయాయి.

గతంలో రహదారికి ఒకేవైపు భూసేకరణ జరిపాలని నిర్ణయించడంతో భూనిర్వాసితులు అభ్యంతరం వ్యక్తం చేయటమే కాకుండా 18 కి.మీ మేరకు మిషన్ భగీరథ పైపులైన్లు పోతుండటంతో నిలిపి వేశారు. దీనికి బదులు జగిత్యాల-పెగడపల్లి-చొప్పదండి మీదుగా మానకొండూర్ చేరుకునే విధంగా గ్రీన్‌ఫీల్డ్ రహదారిని ప్రతిపాదించి సర్వే హద్దులు నిర్ణయించినప్పటికీ పెద్దగా ఉపయోగం ఉండదని భావించి నిలిపివేశారు.

# దిగువన గోదారి.. ఎగువకు చేరేనా?
# ఆందోళనలో జిల్లా రైతులు..?



సిరిసిల్ల: దిగువన గోదావరి జలాలు ఎల్లంపల్లి ఎత్తిపోతల ద్వారా మధ్యమానేరుకు వచ్చి చేరుతున్నాయి. కాళేశ్వరం లింక్-3లో మధ్యమానేరు నుంచి ఎగువమానేరుకు నీటి తరలింపులో అసంపూర్తి పనులతో సింగసముద్రం వరకు తరలించే వీలుంది. వర్షపాతంలోనూ జిల్లాలో నేటికి 430.7మి.మీ.లు కురవాల్సి ఉండగా 345.7 మి.మీ. మాత్రమే కురిసింది. మెట్ట ప్రాంతంలో వర్షాధారంగా ఎక్కడా చెరువులు నిండలేదు. గోదావరిలోకి వరదనీరు వచ్చిచేరుతుండటంతో ఎత్తిపోతల ద్వారా నంది పంపుహౌస్ నుంచి మధ్యమానేరుకు నీటిని తరలిస్తున్నారు. ప్రస్తుతం మధ్యమానేరులో 7.66 టీఎంసీల నీరుంది. ఇది 15 టీఎంసీలు చేరిన తర్వాతే దిగువ మానేరు, అన్నపూర్ణ జలాశయాలకు తరలించే వీలుంది. ఎగువమానేరు జలాశయం సామర్థ్యం రెండు టీఎంసీలు. ప్రస్తుతం దీనిలో నీటి నిల్వ 0.42 టీఎంసీలు మాత్రమే ఉంది. దీనిలోకి వరదనీరు అంతంతమాత్రమే. గతేడాది ఈ సమయానికి జలాశయంలో ఒక టీఎంసీపైన నీరుంది. ఈఏడాది చెప్పుకోదగ్గ నీటిధారలే లేవు. ఈ జలాశయం కింద గంభీరావుపేట,ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలల్లో 40వేల ఎకరాలకు సాగు విస్తీర్ణం ఆధారపడి ఉంది. మల్లన్నసాగర్ ప్రధాన కాల్వకు యూటీ నుంచి కూడెల్లివాగులోకి నీటిని విడుదల చేయడం ద్వారా ఎగువమానేరుకు నీరు చేరే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మల్లన్నసాగర్‌కు నీటి తరలింపే సందిగ్ధంలో ఉంది. జిల్లా మొత్తం 666 చెరువులున్నాయి. వేములవాడ, వేములవాడ గ్రామీణ, కోనరావుపేట మండలాల్లోని 27 చెరువుల్లో మాత్రమే 75శాతం నీరుంది. మిగతా వాటిలో 25శాతం కూడా నీరు చేరలేని పరిస్థితి ఉంది. చందుర్తి మండలంలో అత్యధికం, బోయినపల్లి, వేములవాడ, సిరిసిల్ల, తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో మాత్రమే సగటుకు మించి వర్షపాతం. మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-3లో ప్రధానమైన తొమ్మిదో ప్యాకేజీలోని మల్కపేట పంపుహౌస్‌లో గతేడాదే మే, జూన్ నెలలో రెండు మోటార్ల ట్రయల్ రన్ ప్రారంభానికి సిద్ధం చేశారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో దీని ఊసేలేకుండా పోయింది. మధ్యమానేరులో 15 టీఎంసీల పైన నీరు చేరితే.. వెనక జలాల నుంచి మల్కపేట పంపుహౌస్‌కు నీటిని తరలిండం సులభం అవుతుంది. అక్కడి నుంచి కాల్వ ద్వారా ఎల్లారెడ్డిపేట మండలంలోని మైసమ్మ చెరువు, అక్కడి నుంచి గంభీరావుపేటలో సింగసముద్రం చెరువుకు కాల్వ ద్వారా నిటిని తరలించవచ్చు. ఇక్కడి వరకు కాల్వ పనులు పూర్తయ్యాయి. ఫేజ్-2లో సింగసముద్రం నుంచి ముస్తాఫానగర్‌లో 2 టీఎంసీల సామర్థ్యం ఉన్న బట్టల చెరువులోకి తరలించే పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మెట్టప్రాంతం కావడంతో జిల్లాలో జలాశయాలు, చెరువులకు నీరుచేరితే భూగర్భజలాలు నిలకడగా ఉంటాయి. వాటిపైనే పంటల సాగు ఆధారపడుతుంది.

# తపాలా బీమా.. బాధితులకు ధీమా




చైతన్యపురి: నిత్యం ఉత్తరాల బట్వాడా, చిన్న మొత్తాల పొదుపు ఖాతాలతోనే కుస్తీ పట్టే తపాలా శాఖ ప్రజలకు చేయూతగా నిలవాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ప్రమాద బీమా ద్వారా బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో, ఇతర ఘటనల్లో ఇంటి పెద్ద మరణించినప్పుడు చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటుపరంగా ఎన్నో రకాల ప్రమాద బీమా అందుబాటులో ఉన్నా.. తపాలా శాఖలో ఉన్న బీమాకు తక్కువ మొత్తంలో ప్రీమియం చెల్లించి రూ.10 లక్షల వరకు బీమా పొందవచ్చు. పాలసీ కావాల్సిన వారు ఆధార్ కార్డు తీసుకెళ్లి రూ.200తో తపాలా బ్యాంకు ఖాతా తెరవాలి. రూ.520 లేదా రూ.749 బీమా తీసుకోవాలి.

ఈ ప్రీమియాన్ని ఏడాదిలో ఒక్కసారి.. ఏటా చెల్లించాలి. బీమా తీసుకునేందుకు 18 నుంచి 65 ఏళ్ల వయసున్న వారు అర్హులు. డివిజన్ పరిధిలో 25 వేల పాలసీలు కరీంనగర్ పోస్టల్ డివిజన్ పరిధిలో (జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్) ఈ సంవత్సరం 25 వేల మందికి ప్రమాద బీమా పాలసీలు అందించారు. పాలసీదారులు విద్యుత్తు, రోడ్డు, వివిధ ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలకు పరిహారం అందిస్తారు. ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో 25 మంది బాధిత కుటుంబాలకు పరిహారం అందించారు. 50 మంది గాయపడి ఆసుపత్రిలో చేరితే చికిత్సకు కొంత డబ్బు ఇచ్చారు. తపాలా బీమాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నాం. అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నాం. తక్కువ ప్రీమియంతో అందించే ప్రమాద బీమా పాలసీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

# కార్యకర్తలకు అండగా ఉంటాం..

■ ఎమ్మెల్యే బిఎల్ఆర్

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**



కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ మండల పరిధిలోని 10 ఎంపీటీసీ స్థానాలైనటువంటి ఐలాపురం, చిల్లాపురం తుంగపాడ్ సామ్య గాని తండా,జప్తి వీరప్ప గూడెం వెంకటాద్రి పాలెం,చింతపల్లి, కొత్త గూడెం,లక్ష్మీపురం, గూడూరు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా పలు గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమాలలో గ్రామాల్లో, సమస్యలను నాయకుల సమస్యలను, కార్యకర్తలు సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం కట్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తను గుర్తిస్తాము వారికి అండగా ఉంటామని అన్నారు.అలాగే వారి నుంచి సేకరించిన సమస్యలను మన ఇంచార్జీ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర్ రావు,మన జిల్లా మంత్రి వర్యులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్‌కి తెలియజేసి వారందరి సహాయ సహకారాలతో ప్రతీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సమస్యలను పరిష్కరించేలా చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కావడానికి ఏవిధంగా కష్టపడి పనిచేసారో అదే విధంగా రానున్న స్థానిక ఎన్నికల్లో కూడా పని చేసి కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు, వార్డ్ మెంబెర్స్, కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యాధులపై సిబ్బందికి అవగాహన కల్పించాలి

■ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్

**వేద న్యూస్, మరిపెడ :**




మహబూబాబాద్ ఐఎంఏ హాల్ లో జిల్లాలోని యం.యల్.యచ్‌పిలు, ఇతర లైన్ శాఖల తో నిర్వహించిన సమన్వయ రివ్యూ సమావేశంనకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.మురళీధర్ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ స్క్రీనింగ్ పరీక్షలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో యంఎల్‌చ్‌హెచ్‌పిలు తప్పనిసరిగా చేయాలని ఒకవేళ నిర్ధారణ జరిగినట్లయితే అటువంటి వారిని సంపూర్ణ సురక్ష కేంద్రాలకు పంపించి నిర్ధారణ చేసి మందులు ఇప్పించాలని ఆయన పేర్కొన్నారు. హెచ్ఐవి,ఎయిడ్స్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది అవగాహన కల్పించాలని ఈ మధ్యకాలంలో హెచ్ఐవి కేసులు జిల్లాలో పెరగడం ఆందోళనకు గురి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో సిబ్బంది అవగాహన నిర్వహించినప్పుడు అపరిచితులతో లైంగిక సంపర్కం కూడదని, గర్భిణీ స్త్రీలకు విధిగా హెచ్ఐవి టెస్టును నిర్వహించడం ద్వారా ఒకవేళ హెచ్ఐవి పాజిటివ్ గా నిర్ధారణ అయితే తల్లి నుండి బిడ్డకు సంక్రమించకుండా చూసుకోవచ్చని ఒక నిండు జీవితాన్ని కాపాడవచ్చునని ఆయన పేర్కొన్నారు.

ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్యం మంత్రాలలో పనిచేసే ఎంఎల్ఎహెచ్పీలు అన్ని జాతీ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయడం లో ముందంజ లో వుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సారంగం, డాక్టర్ విజయ్ డాక్టర్ శ్రవణ్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్ ,క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, సిఎస్ఓ సారయ్య, ఎస్ యు ఓ రామకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ లు పురుషోత్తం , గీత,సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ రమేష్, కౌన్సిలర్ రమేష్ లు, యం ఎల్ యచ్ పి లు, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ శాంత రాజ్, వర్ద్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించాలి

■ విద్య అధికారి బి.నారాయణ

**వేద న్యూస్, జగిత్యాల :**



వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల కు ప్రేరణ తరగతులు నిర్వహించాలని జగిత్యాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బొప్పరాతి నారాయణ అన్నారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్-711 ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ -2025 ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకులకు ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెంచేలా, పరీక్షల పట్ల భయం పోగొట్టేలా ప్రేరణ తరగతులు నిర్వహించి, చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రతిరోజు స్టడీ అవర్స్, టెస్టులు పెట్టాలని, విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి అధ్యాపకుడు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి. నర్సయ్య, ప్రధాన కార్యదర్శి డా.పి.తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. రాజేషం, రాష్ట్ర కార్యదర్శి ఏం. విజేందర్ రావు, సిహెచ్ నర్సయ్య, రాజేంద్ర ప్రసాద్, ప్రమోద్ కుమార్, రామ్ ప్రసాద్, తిరుపతి, రాజమౌళి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ..చిక్కులు లేకుండా చేశాం..

**మొదటి పేజీ తరువాయి**

తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేశారని, ఇందులో సీఎం రేవంత్ రెడ్డి భాగస్వామ్యం అయ్యారని మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 3 దశాబ్దాలుగా పోరాటం జరుగుతుందని గుర్తు చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపామని అన్నారు. ఎన్నో సందర్భాల్లో రేవంత్ ఎమ్మార్పీఎస్‌కు అండగా ఉన్నారని గుర్తు చేశారు. షమీమ్ అక్తర్ నివేదికను ఆలస్యం లేకుండా ఆమోదించారని, రిజర్వేషన్ శాతం విషయంలో కొన్ని లోపాలున్నాయని తెలిపారు. కులాల చేర్పులు మార్పుల్లో లోటుపాట్లపై వినతిపత్రం అందజేశామని అన్నారు. ఎస్సీ కుల్లాల్లో అత్యధికంగా 62 శాతం జనాభా ఉన్న మాదిగలను రిజర్వేషన్ శాతంలో అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ జనాభాలో రెండో స్థానంలో ఉన్న మాలలను జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ శాతం రిజర్వేషన్ కేటాయించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తరహాలోనే ఏబీసీడీ వర్గీకరణ చేయాలని, చేవెళ్ల డిక్లరేషన్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లు ఎస్సీ వర్గీకరణను 15 నుంచి 18 శాతం పెంచి వెంటనే అమలు చేయాలని మందకృష్ణ సీఎంను కోరారు. ఎస్సీ వర్గీకరణలో ఉన్న లోటుపాట్లను రేవంత్ రెడ్డి సరిదిద్దుతారని భావిస్తున్నామని ఆయన అన్నారు.

# ‘ఆఖరి’ మజిలీకి అంతులేని కష్టాలు

**మొదటి పేజీ తరువాయి**

తీసుకోవాలని మృతుల బంధువులు, కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. ఆత్మీయులను కోల్పోయి తాము పుట్టెడు దు:ఖంలో ఉండగా, అంతిమ సంస్కారాలు గౌరవంగా నిర్వహించుకునేందుకు సౌలతులు లేకపోవడం చూసి తమ మనసు భారంగా మారిందని విచారం వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన ఆవులు, పందులు, కుక్కల కళేబరాల నడుమ మనిషి అంత్యక్రియలు నిర్వహిస్తే వారి ఆత్మకు సైతం శాంతి చేకూరదమోననే అనుమానాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులు ఈ శ్మశాన వాటిక విషయమై దృష్టి సారించాలని, గౌరవప్రదంగా ‘ఆఖరి’ మజిలీ నిర్వహించుకునేందుకు ఏర్పాట్లను తక్షణమే చేయాలని కోరుతున్నారు. నాగరిక సమాజంలో మనిషి మరణానంతరం చివరి కార్యక్రమం అయిన ‘అంత్యక్రియలు’ సరిగా నిర్వహించుకోలేకపోతే ఆ బాధ మృతుల కుటుంబ సభ్యులు, ఆత్మీయులను జీవిత కాలం వెంటాడుతుందని వెల్లడిస్తున్నారు. స్థానిక నేతలు, సంబంధిత శాఖ అధికారులు ఈ విషయమై మానవతాకోణంలో స్పందించాలని, తగు చర్యలు వెంటనే తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కదలి రండి..

**మొదటి పేజీ తరువాయి**

ఒక్కరూ తమ వంతుగా భాగస్వాములు కావాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు టీఎస్‌జేయూ బాధ్యులు వెల్లడించారు. ముఖ్యంగా యువత పెడదోవ పట్టకుండా ఉండేందుకు తమవంతుగా సమాజంలో అవగాహన కోసం ‘డ్రగ్స్ వాడను’ అని రన్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరితో ప్రతిజ్ఞ చేయించనున్నట్టు తెలిపారు. యువత ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. ఆ టార్గెట్ రీచ్ కావడం కోసం మాత్రమే అకుంఠిత దీక్ష, అంతులేని ఆత్మవిశ్వాసంతో కృషి చేయాలని .. జీవితంలో ఉన్నతస్థానానికి వెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు ప్రతి ఒక్కరికీ తెలిపే సదుద్దేశంతో ఈ రన్ కార్యక్రమం ప్లాన్ చేసినట్టు తెలిపారు.



## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణంలో (ఎమ్ పిపిఎస్) గాంధీ పార్క్ పాఠశాల లో,స్వపరిపాలన దినోత్సవం మంగళవారం ఏర్పాటు చేయడమైనది. విద్యార్థులు, ఉపాధ్యాయులై, సహచర విద్యార్థులకు, పాఠాలు బోధించడం తో ఎంతో ఉత్సాహం, ఉల్లాసంతో, పాల్గొన్నారు.ప్రధానోపాధ్యాయులుగా సాయి అక్షిత, మండల విద్యాధికారిగా కీర్తన, కలెక్టర్‌గా మాహిం, విద్యాశాఖ మంత్రిగా కార్తిక, జిల్లా విద్యాశాఖ అధికారిగా భార్గవి, టీచర్ లుగా చిట్యాల రక్ష, భార్గవి, షాలిని,(పిఈటి)గా శిల్ప నిర్వహించినారు, పిల్లల్లో సృజనాత్మకత వెలికి తీయడం ఈనాటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో విద్యార్థి ఉపాధ్యాయుడు అయితే ఎలా ఉండాలో పిల్లలకు అవగాహన ఉంటది అని ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని ప్రధాన ఉపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కురువ నాయక్, ఉపాధ్యాయులు ప్రవీణ్,రాంరెడ్డి, పార్వతి, రమణాచారి, సలీమా, నిర్మల,సరిత, కిరణ్, మధు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ పోటీ చేయట్లేదు

**వేద న్యూస్, హైదరాబాద్ :**



అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ నేతలం నిరాశ, నిస్పృహలో ఉన్నామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కీలక కామెంట్స్ చేశారు. ఉన్న మాటే చెబుతున్నానుని.. దీనిలో దాపరికం ఏమీ లేదని చెప్పారు. ఇవాళ(మంగళవారం) తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం లేదని చెప్పారు. ఓటరు నమోదు కార్యక్రమంలో తాము పాల్గొనలేదన్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో తప్పిదాలున్నాయన్నారు. గతంలో కూడా బీఆర్ఎస్ పోటీ చేయని సందర్భాలు ఉన్నాయని అన్నారు.



## ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ

**వేద న్యూస్, శాయంపేట:**

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ నిర్వహణకు ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో ఫణి చంద్ర అధ్యర్యంలో నిర్వహించగా రిటర్నింగ్ అధికారులకు శిక్షకులు శ్రీనివాస స్వామి, రాజారాం లు శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరకాల డిఎల్పిఓ షరీఫోద్దీన్, ఎంఈఓ బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



## స్టేజి-వన్ జిపి ఎన్నికల శిక్షణా తరగతులు

**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సహాయ జిల్లా ఎన్నికల అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు ఆధ్వర్యంలో రిటర్నింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ స్టేజి - వన్ జిపి ఎన్నికల శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతుల కార్యక్రమంలో రిటర్నింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్స్, శిక్షణా తరగతుల ట్రైనర్ ఆఫ్ ట్రైనర్స్ భాస్కర్ రెడ్డి టీం, మండల పంచాయతీ అధికారి సిహెచ్ రవి పాల్గొన్నారు.

## పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది : సీపీ

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**



పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ సిపి పోలీస్ అధికారులకు సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఏ. ఎస్. ఐగా విధులు నిర్వహిస్తూ ఎస్ ఐలుగా పదోన్నతి పొందిన సంపత్, యాదగిరి, విజయ్ కుమార్ లు మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ మార్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పోలీస్ అధికారులతో మాట్లాడుతూ వీలైనంత వరకు ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని, పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు బంగం కలిగించే రీతిలో వ్యహరించవద్దని పోలీస్ కమిషనర్ సూచించారు.



## నిషేధ గుట్కా ప్యాకెట్లు పట్టివేత

**వేద న్యూస్ శాయంపేట:**

నిషేధిత గుట్కా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్వర తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో శివ కిరాణంలో విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ నిర్వహిస్తుండగా సుమారు 3034 రూపాయల నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనపరుచుకుని, నిందితున్ని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు.



## అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

■ ఎస్పీ శరత్ చంద్ర పవార్

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

నల్గొండ జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. మంగళవారం శాలిగౌరారం పోలీస్ స్టేషన్ మండల పరిధిలోని ఇసుక రీచ్‌లను పరిశీలించిన అనంతరం మాట్లాడారు.అక్రమ ఇసుక రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేదే లేదని,అక్రమ రవాణా,డంపింగ్ చేసే వారి పై చట్ట ప్రకారం కేసు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో ఇసుక రవాణా చేయరాదని, ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నట్లు తెలిస్తే డయల్ 100కు గాని సంబంధిత పోలీస్ స్టేషన్ కి గానీ సమాచారం అందించవలసిందిగా పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073